# వ్యథార్తుని అవ్యక్తత

కథానిక

ఆఫీసువరండాలో నించోని "ఒక్కొక్క మనిషికొక ప్రత్యేక అవలక్షణం వుంటుంది" అనుకుంటున్నాడు అర్థస్వగతంగా కృష్ణమూర్తి.

ఒకటో తారీకు. సాయంత్రం అయిదుగంటలు. నిర్విరామంగా కుర్చీమీద కూర్చుని టేబుల్ మీది కాగితాల దొంతరలు చూస్తూ గుటకలు వెయ్యాల్సిన కృష్ణమూర్తికి మానవ మనస్తత్వపరిణామాలమీదికి ఆలోచన యెందుకుపోయిందో నాకర్థం కాలేదు.

"ఏమిటి అంటున్నారు?" అన్నాను.

"అబ్బే యేమీలేదు."

ఏమీ వుండకుండా వుండదని నాకు తెలుసు. నాకు తెలుసునని ఆయనకూ తెలుసు. నింపాదిగా చెయ్యిపట్టుకుని కాస్త రహస్యంగావుండే స్థలానికి తీసుకెళ్ళి యేమిటో చెప్పమన్నాను.

"సుబ్బారావు గురించి అన్నాను" అన్నాడు.

"ఏమంటాడతను?"

"చూడండి. మనందరమూ కూడా ఆర్థికంగా ఒకే మందస్థాయిలో వున్న వాళ్ళం. మనని మనమే మోసపుచ్చుకోటం అవమానించుకోటం తగునా?" అన్నాడు కృష్ణమూర్తి.

నేనేమీ పలకలేదు. ఆయనే సాగించాడు: "నాలుగు నెలల క్రితం సుబ్బారావు నాదగ్గర తీసుకొన్న యెనిమిదిరూపాయల చేబదులు యింతవరకూ పరిష్కారం కాలేదు. పరస్పరమిత్రత్వాన్ని పురస్కరించుకుని ముఖం యెదటే అడిగెయ్యలేక వూరుకొన్నాను. నేనుమాత్రమేం కుబేరుడిని కానుగదా? ఆ కాస్తపనీ యివాళ చేశాను. 'నా దగ్గర డబ్బులేదు, వున్నప్పుడు తీసుకో' అంటాడు యేమంత సబబో మీరే చెప్పండి" అన్నాడాయన. ఆయనముఖం నిజంగా జేవురించిపోయింది.

"సుబ్బారావు మూర్ఖుడనీ వ్యవహారజ్ఞానశూన్యుడనీ నేననను. కాని—డబ్బువిషయంలో తోటివాళ్ళకు యెన్ని యిబ్బందులుంటాయో మనం వాళ్ళని అనవసరంగా బాధించకూడదన్న యింగితం వుండాలంటాను. అతనీవిషయం గమనించాలి."

"గమనించేశక్తి అతనికి లేనప్పుడు గమనింపజేయడం మన విధ్యుక్త ధర్మం" అన్నాను, నా మెదడు తలకిందులుగా పనిచేస్తోంది. ఏమిటి చెయ్యటం?

కృష్ణమూర్తి వెళ్ళిపోయేక మరియిద్దరుముగ్గురు యిదేవిషయాన్ని తమలో తాము చెప్పుకొని వాపోవటం విన్నాను. చివరకు వాళ్లు తేల్చుకొన్న సారాంశం ఏమంటే, సుబ్బారావులాంటి మూఢులకు యికనెవ్వరూ చేబదుళ్ళు యివ్వటం కూడదని.

"మనిషి తత్వం తెలిసిందిగనక యికనెవ్వరం యివ్వము. కాని, యిదివరకేయిచ్చిన డబ్బుమాటయేమిటి?" అనడిగాను. ఒకరిముఖాలు ఒకరం చూచుకున్నాము.

మొత్తానికి సుబ్బారావు చర్యను మేమందరమూ నిశితంగా నిరసిస్తున్నాము. నా మెదడు మాత్రం ఒకంతట్లో యీ విషయాన్ని వదిలి విశ్రాంతి తీసుకునేట్టు తోచదు. ఏదో పరిష్కారమార్గం ఆలోచించాలి. తప్పదు అనుకున్నాను.

ఆర్థికమాంద్యం, ప్రజల కొనుగోలుశక్తి తగ్గటం ప్రభుత్వ సహాయనిరాకరణం యిలాంటి విషయాలమీద సుబ్బారావుతో యేం మాట్లాడీ యేమీ ప్రయోజనం లేదు! ఎంచేతంటే వాటిలో అతను మాకన్నా మేధావే అవును.

నెలసరి జీతాలు మాక్కొన్నాసూ చాలవు, చివరివారం రోజుల్లోనూ యెంతదొరికితే అంత అప్పు చేస్తూనే వుంటాము. కాని యివన్నీ తిరిగి జీతం అందిన వుత్తర క్షణంలో తీర్చెయ్యకపోతే మా పరపతి నిలవదు. ఇక అప్పు పుట్టదనే భయంతోనైనా వెంటనే తీర్చేస్తాము. కాని సుబ్బారావు వుద్దేశ్యం యేమైవుంటుంది? ఏమిటతని కాధైర్యం? ఒకడికి మాటయిచ్చి దాన్ని నిలుపెట్టుకోలేకపోతే యిక వాడిముందు తిరిగేందుకు

శ్రీ విరించి

తల కొట్టేసినట్టు యమయాతన పడతామే. ఈ వెధవ అంతరాత్మ వేధించుకు తింటుందే—ఇక మరి యీ సుబ్బారావనే మానవ మాత్రుడు నాలుగు నెల్లబట్టీ యెట్లా నిద్రపోతున్నాడు?

“ఇప్పుడు నాదగ్గర డబ్బులేదు. ఉన్నప్పుడు తీసుకో” అన్నాట్ట. ఎంత నిబ్బరం! ఇవ్వటమూ తిరిగి తీసుకోడమూకూడా కృష్ణమూర్తి వంతే అయితే యిక సుబ్బారావు చేసే పనేమిటి? ఇక నతన్ని మనిషిగా పరిగణించటం యెలాగు?

“లాభంలేదు. సుబ్బారావులో అణిగిమణిగి నివురుకప్పిపోయిన మానవత్వాన్ని మేల్కొల్పాలి. ధర్మసూత్రాలనూ నీతి నిజాయితీలనూ మరుగుపరుస్తున్న దానవత్వాన్ని పారద్రోలాలి. అతన్నెట్లాగయినా కన్విన్సు చేసి కృష్ణమూర్తికి తక్షణమే ఎనిమిదిరూపాయలూ తిరిగి యిచ్చేసేట్టు చేయాలి, కాగా జరిగిన ఆలస్యానికీ తన పెడజవాబుకీ మిత్రుడి మనస్సు కష్టపెట్టిన మూఢత్వానికీ క్షమాపణ చెప్పించాలి. అప్పుడుగాని నా విధ్యుక్తధర్మం నెరవేర్చినట్టు కాదు” అనుకొన్నాను.

శిరఃకంపన ఒకక్షణం ఆగింది. మళ్ళీ ఒక క్షణం పస్తాయించాను. నేనెవరు? ఈ కథలో నాకు జోక్యం యేమిటి? “కృష్ణమూర్తికీ నీకూ వున్న లిటిగేషన్సు యేమిటో! ఇందులో నీకు సంబంధం యెందుకు? అనవసరమైన విషయాలు కెలుకుతావేం, నీఅంత తెలివి అవతలవాళ్ళకూ వున్నదని ఇప్పటికయినా తెలుసుకొని వర్తించు” అని సుబ్బారావంటే నేనేం చెయ్యాలి?

కృష్ణమూర్తికీ అతనికీ యెన్నెన్నో లిటిగేషన్లు వుండొచ్చు, నా కభ్యంతరంలేదు. కాని బయట మనమంతా కలిసి నిర్మించుకొన్న సమాజం అంటూ ఒకటుంది. ఆ సమాజం తరఫున నిన్ను నిలవేసి మరీ అడుగుతున్నాను—అంటాను! అవతలి వ్యక్తి కృష్ణమూర్తయినా మరో వెంకటసుబ్బయ్యా అయినా నాకు పట్టదు. కాని నువ్వు చేసినపని నాకు నచ్చలేదు. అది మానవ ధర్మాలను మాటుపెడుతోంది. నీ ఒక్కడితో అయిందా యేమిటి? రేపు కృష్ణమూర్తి మేమెవరం అణా అప్పు అడిగినా లేదని పూరుకుంటాడు. నీవు నేర్పిన గుణపాఠంవల్ల అతను అబద్ధం ఆడటం అనే కొత్త విషయం నేర్చుకోవలసి వస్తుంది. తోటి మానవుడిమీద అపనమ్మకం బయలుదేరుతుంది. అతన్ని క్షణక్షణానికీ వేధించే పశుప్రాయపుటభిప్రాయం ఒకటి మిగిలిపోతుంది. నువుచేసిన పనివల్ల పశువుగా తయారయావు ఇదొక్కటీ చాలు యీ విషయంలో నేను జోక్యం కలిగించుకొందుకు అంటాను.

సుబ్బారావు యెంత కఠినాత్ముడు! నాలుగు సంవత్సరాలనుంచి తనకు రావలసిన ఇంక్రిమెంటు “డ్రా” చేసి యివ్వనందుకు తోటిగుమాస్తా ఒకడిని మనసులోనూ బయటుకూడా తిట్టిపోస్తున్నాడే! నాలుగు నెలలకింది బాకీయే తను తీర్చడు!

పొద్దున లేచిందిమొదలు మనం సంస్కారం అంటూ ఒకటి వెంటవేసుకుని తిరుగుతూంటాము. మనంచేసే ప్రతిపనికీ దాన్నే జవాబుదారీ చేస్తాము. మన ప్రతి పనిలోనూ దాన్ని యిరికిస్తాము. ఎక్కడో నయాగరాజలపాతంలో ధభీలని దూకే వరవడికి కలిగేశబ్దం మన చెవులకు అస్పష్టంగా వినిపిస్తూంటుంది. ఏమిటి మనం చేస్తున్న యీ పనులు?

ఒకటో తారీకు రాత్రి నాకు సరిగా నిద్ర లేదు. ఇవే ఆలోచనలు. ఒకవేపు సుబ్బారావూ మరోవేపు కృష్ణమూర్తీ కనిపిస్తారు. ఎవరిది న్యాయం? ఎవరిది అన్యాయం? ఇద్దరిదీ అన్యాయమూ, న్యాయమూనా?-అట్లా ఆయేందుకు అవకాశం యెట్లావుంది? మనం మానవులంకాని సందుల్లోని పందులం కాదు. మనం ముందుకు దూకి కార్యాచరణలో తల మునక్కలయేటు పని చేసి ప్రగతిని సాధించాలిసిన వాళ్ళంకాని మోసంతో అన్యాయంతో సిగ్గువిడిచి సంచరించాలిసిన అనాగరీకులం కాదు. నిజం యెప్పటికయినా నిజమే.

రెండో తారీకు ఆదివారం అయింది కనక—తాపీగా తొమ్మిదింటికి లేవటం జరిగింది. కాలకృత్యాలన్నీ తీర్చుకుని యెప్పుడో నేను నిద్ర లేవకముందే కుర్రవాడు తెచ్చిపడేసిన రెండణాల పేపరు చదవకుండానే బజారుకు బయలుదేరాను. గతదినపు టాలోచనలు నన్ను అప్పుడు యేం చేసున్నానో చెప్పలేనుగాని నేనుమాత్రం అనుకోకుండానే సుబ్బారావు యింటికి చేరుకున్నాను.

అదృష్టవశాత్తూ ఆయన ఇంట్లోనే వున్నాడు.

కుశలప్రశ్న లయ్యాక అసలు విషయంలోనికి ఉపక్రమించాను:

"కృష్ణమూర్తికి మీరివ్వాల్సిన ఎనిమిది రూపాయలూ జాగుచేస్తున్నారట! అతను నిన్న నాతో చెప్పుకుని మహా విచారపడ్డాడు" అన్నాను.

సుబ్బారావు ముఖంలో వెంటనేవచ్చిన ఉద్వేగం ఏమిటో నేను చదివెయ్యలేకపోయాను. ఆయనమాత్రం జవాబు చెప్పాడు: "ఏనెల కానెలే యివ్వలేకపోతున్నాను. తలకుమించిన భారం అయిపోయింది. ఏంచెయ్యను? రెండొందలు పంపమని మా బావమరిదికి ఉత్తరంరాసి వారంరోజులయింది. వాడింతవరకూ జవాబే యివ్వడు" అన్నాడు.

"నా ఉద్దేశ్యం మీరు కావాలని ఆలస్యం చేస్తున్నారని కాదు. మీరు బాకీ తీసుకున్నప్పుడు చెప్పిన మాటేమిటి. వచ్చే మొదటి తారీకున యిస్తామన్నారుకదా? నాలుగు నెలలు..."

"ముందే చెపితినే? ఏనెల కానెలే, యీ నెల బాకీలన్నీ తీర్చేదామనుకోవటం, తీరా జేబులో డబ్బు జేబులోనే హరించిపోవటం—మామూలయిపోయింది."

"కాస్త ఆలోచించండి. అన్నింటి విషయం వేరూను, కృష్ణమూర్తిదగ్గర తీసుకొన్న డబ్బు విషయం వేరూను! మనందరి జీతమూ సమానమే అయినప్పుడు మీరిట్లా అతన్ని బాధపెట్టి—"

"తప్పదుమరి. మన బాధలు—"

ఎట్లా సుబ్బారావుని వినేలా చెయ్యటం?

"ఏమియినా మీరు కృష్ణమూర్తివిషయంలో ఉపేక్షించటం మాకెవరికీ సబబుగాలేదు. అతనేమి పెట్టైనిండా డబ్బున్నవాడు కాదుగదా? జీతంమీదే యింటిల్లిపాదీ బతకాలి. మనందరికన్నా అతనికి డాక్టరుబిల్లు అనే ఖర్చు అదనముగా వున్నది! కాస్త ఆలోచించండి తాపీగా. మీకే తోస్తుంది, మీజాగుకల్ల అవతలివాడు పడే కష్టాలు. మీ మూలంగా వారో మనిషి కుంగిపోవటం మీకుమాత్రం యిష్టమా?"

సుబ్బారావు నేనెన్ని కఠినోక్తులు చెప్పినా కోపపడకుండా వప్పుకున్నందుకుమాత్రం సంతోషించాను. కాని మొత్తం మీద తనది తప్పేనని నేను వప్పించలేకపోయాను. పోతే అవతలివాడు యిబ్బందిపడుతున్నాడు కనక బాకీలో కొంత భాగంమాత్రం యిప్పుడిచ్చి మిగతాది కొద్దిరోజులలో యిస్తానన్నాడు. ఆ కొంతభాగం అయిదు రూపాయిలు చేయించేటప్పటికి నా తలప్రాణం తోకకొచ్చినంత పనయింది. లేచి వస్తూవస్తూ సోదర మానవాళిపట్ల వర్తించటంలో యెంతో మెళుకువ వుండాలనీ మననిగురించి మరొకడు చెడుగా భావించేందుకు స్కోప్ యివ్వగూడదనీ చెప్పాను.

నేనిట్లా బజారున పడ్డానోలేదో వెనకనించి విపరీతమైన సైజులో నవ్వు వినిపించింది. ఆనవ్వు సుబ్బారావుదేనా అన్న విషయం నేను ఆమీ తుమీ తేల్చుకోలేకపోయినాను. ఇంతకూ యీ వ్యవహారంలో నాపాత్ర యెంతవరకు సమంజసమో సమర్థనీయమో మటుకు నా కర్థంకాదు.

## సన్యాసుల సంపద!

ప్రఖ్యాతిగాంచిన మన నాగరికతా సంప్రదాయాలకి, జీవంతో ఉట్టిపడుతూ, ఉత్తేజపరిచే చిహ్నాలే—మన సాధువులూ సన్యాసులూను. ఏ యితర సంస్కరణ సంఘాలూ యివ్వలేని దోహదం వీరు మన నైతికాభ్యుదయానికిచ్చారు. తలుచుకుంటే వీరు సంఘాన్ని సన్మార్గంలోపెట్టి శాంతిసంతోషాలకీ అఖండాభివృద్ధికీ దారితీయకలరు. మానవ సౌభాగ్యానికి తోడ్పడే ఆశయాల్ని ఆదేశించి ప్రస్తుత పరిస్థితులనుంచి సంఘాన్ని ఉద్ధరించకలరు. మనశ్శాంతినీ, ఆత్మపరిశుద్ధతను పొందడానికి రహస్యాలు వీరికి తెలుసు. ఈ విషయంలో సాధువుల, సన్యాసుల వర్గం మన దేశానికే ఒక అమూల్యమైన ఆస్తి—పండిత గోవిందవల్లభ పంత్.